# ఐ బొమ్మ, బప్పం టీవీలు బంద్

## ఇమ్మడి రవి చంచల్‌గూడ జైలుకు తరలింపు

### వారం రోజుల కస్టడీ కోరనున్న పోలీసులు

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** పైరసీ సినిమాల ద్వారా సినీ పరిశ్రమకు తీరని నష్టం కలిగించిన కేటుగాడు ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవికి చెందిన ఐ బొమ్మ, బప్పం టీవీలు ఎ ట్టకేలకు మూతపడ్డాయి. ఇమ్మడి రవి చేత వీటిని మూసి వేయించిన పోలీసులు అనంతరం శనివార ం రాత్రి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇతడిని మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైం పోలీసులు సోమవారం నాడు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

అనేక భాషల సినమాలను, ఓటిటి కంటెంట్లను విడుదలకు ముందే అధునాతన కంప్యూటర్లు, ఇతర ఉపకరణాలతో కంప్యూటర్ల ద్వారా డౌన్‌లోడ్ చేసి వాటిని పైరసీ సిడిలుగా మార్చి మార్కెట్లో విడుదల చేస్తూ సినీ రంగాన్ని సంక్షోభంలో నెట్టిన ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి క థ ముగిసింది. కొన్ని నెలలుగా యూరప్ దేశాలతో పాటు కరేబియన్ దీవుల్లో వుంటూ సినీ పైరసీకి పాల్పడుతున్న ఈ నేరగాడిని శుక్రవారం అర్ధరా త్రి శివార్లలోని కూకట్‌పల్లిలో తన స్నేహితుడి ఇంట్లో వుండగా అరెస్టు చేయడం తెలిసిందే. దమ్ముంటే తనను పట్టుకోవాలని పోలీసులకు సవాల్ విసిరిన ఇతగాడు హైదరాబాద్‌కు వచ్చిన విషయమై పక్కా సమాచారం అందుకున్న సైబర్ క్రైం పోలీసులు పట్టుకోవడం విదితమే. ఇతని వద్ద నుం చి మూడున్నర కోట్ల రూపాయల నగదుతో పాటు వందల సంఖ్యలో పైరసీ సిడిలు, హార్డ్ డిస్క్‌లు, సినిమాలను పైరసీ చేసేందుకు వాడే కంప్యూట ర్లు, ఇతర ఉపకరణాలను జప్తు చేశారు. నిందితుడిని కోర్టు శనివారం సాయంత్రం పొద్దుపోయాక కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మే రకు రెండు వారాల రిమాండుకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా వైజాగ్‌కు చెందిన ఇమ్మడి రవి కొన్నేళ్లుగా దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను ముందుగానే తస్కరించి వాటిని పైరసీ చేస్తూ మార్కెట్లో విడుదల చేస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. మొదట ఇతను పలుచోట్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి కంప్యూటర్‌కు సంబంధించి, ఐటికి సంబంధించి పరిజ్ఞానం సంపాదించాడు. అనంతరం పై రసీ సిడిల తయారీకి పూనుకున్నాడు. మూడు నెలల క్రితం రవి పోలీసులకు సవాల్ విసరడం సంచలనం రేపింది. తనను దమ్ముంటే పట్టుకోవాల ని, తన జోలికి రావద్దని, తన వద్ద వున్న ఒకవేళ వస్తే అనేక మంది ప్రముఖులకు సంబంధించిన రహస్య పత్రాలు, వివరాలు సోషల్ మీడియాలో పెడతానని, ఇందులో సినీ పెద్దల బాగోతాలు కూడా వున్నాయని బెదిరించాడు. ఈ క్రమంలో రవి అనుచరులు పలువురిని గత సెప్టెంబరు 29వ తే దీన అరెస్టు చేసినా ఇతను మాత్రం పట్టుబడలేదు. శుక్రవారం అర్ధరాత్రి వేళ ఇత న్ని అరెస్టు చేశాక పోలీసులు భిన్న కోణంలో విచారించి అతని గో ల్‌మాల్ వ్యవహారాలను రట్టుచేశా రు. దీని తరువాత పైరసీ సినిమాలను ఉచితంగా చూసేందుకు రవి ఏర్పాటు చేసిన ఐ బొమ్మ, బప్పం టివిలను అతని చేతే మూసి వేయించారు. ఇందుకు గానూ సర్వర్ల చిరునామాలను డిలీట్ చేయించారు. కాగా ఇతని వద్ద నుంచి జప్తు చేసిన హార్డ్ డిస్క్‌లను పోలీసులు విశ్లేషిస్తు న్నారు. కాగా పోలీసులకు చిక్కకుండా వుండేందుకు రవి నెథర్లాండ్స్‌లోని అమ్ స్టర్‌డం, ఫ్రాన్స్ లోని పలు నగరాలు, కరేబియన్ దీవుల్లో వుంటూ ఐపి అడ్రస్సు లను మారుస్తూ తన కార్యకలాపాలను సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తాను పైరసీ చేసిన సినిమా లు, ఓటిటి కంటెంట్లను ఐ బొమ్మ, బప్పం టీవీ, ఐ విన్ వెబ్‌సైట్లలో వీక్షకులకు ఉచితంగా చూసే అవకాశం కల్పిం చడం ద్వారా రవి పాపులర్ అయ్యాడు. కా గా రవి ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లను ప్రతీ నెల 37 లక్షల మంది చూస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా రవి సాంకేతికత అం శాలపై మంచి పట్టువుంది. ఎలాంటి సర్వర్ అయినా, ఎంతటి భద్రతవున్నా దానిని హ్యాక్ చేయడంలో ఇతను దిట్ట. మొదట పైరసీ సినిమాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఇతను ఆ తరువాత కొత్త సినిమాలు భద్రపరిచే క్లౌడ్ ప్లేర్, ఓటిటి వేదికల నుంచి సర్వర్లను తేలికగా హ్యాక్ చేసి హెచ్‌డి క్వాలిటీతో కూడిన సినిమాలు, వెబ్ సీరీస్‌లను డౌన్‌లోడ్ చేస్తూ వాటిని తన వెబ్‌సైట్లలో వుంచు తున్నాడు. ఈ కేసులో రవిని మరింతగా విచారించేందుకు సైబర్ క్రైం పోలీసులు వారం రోజుల పాటు కస్టడీకి కోరాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం నాడు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు.

### ఐ బొమ్మ నిర్వాహకుడి అరెస్టుపై సైబర్‌క్రైం పోలీసులకు హోంసెక్రటరీ అభినందన

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** సినీ పైరసీకి పాల్పడి సినీ పరిశ్రమను కోలుకోలేని దెబ్బతీసి దమ్ముంటే తనను అరెస్టు చేయాలని పోలీసు లకు సవాల్ విసిరిన ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టుపై హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆనంద్ తనదైన శైలిలో స్పందించారు. రవిని అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆయన అభినందించారు. ఈ మేరకు ఆది వారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రవి బృ ందంలోని అనేక మంది ఇప్పటికే అరెస్టు కాగా కొన్ని నెలలుగా తప్పించుకు తిరుగు తున్న ఇతడు కూడా అరెస్టవడం మంచి పరిణామమని ఆనంద్ తెలిపారు. ఇందుకు సిటీ కొత్వాల్ సజ్జన్నార్, సైబర్‌క్రైం డిసిపి కవితను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



# ఆలోచనలను సంస్థలుగా మార్చిన రామోజీ

## రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

### ఆయన పేరే బ్రాండ్: సిఎం రేవంత్‌రెడ్డి

### నమ్మిన సిద్ధాంతాలను వదలని అక్షర యోధుడు: ఎపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 16:** తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని, సమస్యల పరిష్కారం కోసం సీఎంలు ముందుకు వస్తే సహకరిస్తామని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల సమస్యలు కుటుంబంలోని సమస్యల్లాంటివే, కలసి కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. రామోజీ ఓ కుగ్రామం నుంచి వచ్చి ఎంతో గొప్పస్థాయికి చేరారని, ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి రామోజీరావు ఆయన పేర్కొన్నారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్ లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్స వ కార్యక్రమం ఆదివారం సాయంత్రం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా రామోజీరావు స్పందించేవారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విలువల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన రామోజీరావు సేవలు చిరస్మరణీయమని ఏపీ సిఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అక్షర యోధుడు రామోజీరావుకు నా ఘన నివాళులు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. సమాజంలో ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు, ఆ లోటును రామోజీరావే తన పత్రిక ద్వారా భర్తీ చేసేవారు. ప్రభుత్వాల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజల గొంతుకగా నిలిచారు. ఆయన కేవలం ఒక మీడియా అధినేత మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కలిగిన ఒక మార్గదర్శకుడు అని ప్రశంసించారు. నమ్మిన సిద్ధాంతం కోసం దేనినైనా వదులుకునే తత్వం ఆయనది. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, తన సొంత డబ్బుతో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు. రామోజీరావుకు తెలుగు భాషపై ఉన్న మమకారాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రామోజీరావు సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ రెండువేల ఎకరాల కళాఖండమని, తెలంగాణకు నాలుగో అద్భుతంగా ఆర్‌ఎఫ్‌సీ నిలిచిందని కొనియాడారు. రామోజీరావు పేరు కాదు, ఒక బ్రాండ్. రామోజీ అవార్డుల ఆలోచన చేసిన కుటుంబసభ్యులను అభినందిస్తున్నా.రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులు భావించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి,బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ డి.శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ వంటి ఏడు విభాగాల్లో ఈ రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. రామోజీరావు ఆదర్శాలను, ఆయన సేవా దృక్పథాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ అవార్డులను ఏర్పాటు చేసినట్లు రామోజీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు తెలిపారు.

# 19న రైతులకు పిఎం కిసాన్ నిధులు

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం (పీఎం కిసాన్) నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 21 విడత సొమ్ము రైతులకు జమ చేయడంపై తేదీని ఖరారు చేసింది. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2:00 గంటలకు విడుదల చేయనున్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారికంగా వెల్లడించింది. ఈ 21వ విడతలో రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నట్లు తెలిపింది. ఈ సొమ్మును సీబీటీ బదిలీ ద్వారా దేశంలోని 9 కోట్లకు పైగా పీఎం కిసాన్ లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని పేర్కొంది.

ఇటీవల వరదల తర్వాత జమ్మూ కాశ్మీర్ రైతులకు కేంద్రం ఇప్పటికే 21వ విడత వాయిదాను పంపిణీ చేసింది. ప్రారంభం నుండి ఇప్పటివరకు 20 విడతలలో 11 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు రూ.3.70 లక్షల కోట్లకు పైగా నిధులు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల ద్వారా పంపిణీ చేయబడ్డాయి. కాగా 2024లో కేంద్రం చాలా వేగంగా పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. 17వ విడత జూన్ 18, 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేసింది. నాలుగు నెలల వ్యవధిలోనే రెండు విడతల నిధులు జమ చేశారు. అయితే ఈ ఏడాది మాత్రం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 19వ విడత ఈ సంవత్సరం ఫిబ్రవరి 24న జారీ చేస్తే, 20వ విడత నిధులు ఆగస్టు 2న విడుదల చేశారు. 5 నెలలకు పైగా సమయం తీసుకున్నారు. ఇప్పుడు ఏడాది ముగింపునకు దగ్గరకు వచ్చినా ఇప్పటి వరకూ 21వ విడత రిలీజ్ చేయలేదు. అయితే అనర్హులైన రైతుల పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. దేశ వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది అనుమానిత రైతుల పేర్లను గుర్తించినట్లు పేర్కొంది. వారి పేర్లను తనిఖీ చేసి డూప్లికేట్ లబ్ధిదారుల పేర్లను తొలగించే ప్రక్రియ కారణంగా జాప్యం జరిగినట్లు వెల్లడించింది.

# స్వాతంత్ర్య పోరాట యోధుడు భగవాన్ బిర్సాముండా

## కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయమంత్రి సావిత్రిఠాకూర్

### ట్యాంక్‌బండ్‌పై ఘనంగా గిరిజన గౌరవ దినోత్సవాలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 16, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులతో పోరాడిన పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా అని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ కొని యా డారు. ఆదివారం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్క రించుకుని ట్యాంక్ బండ్‌పై తెలంగాణ బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షులు రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన గౌరవ దినోత్స వ వేడుకలకు ఆమె బీజేపీ తెలం గాణ అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించి, ర్యాలీగా కొమురం భీమ్ విగ్రహం వరకు వెళ్లి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సావిత్రి ఠాకూర్ మాట్లాడుతూ గిరిజనులు, ఆదివాసీలు, లాంబాడీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. భగవాన్ బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రామచంద్రరావు మాట్లా డుతూ బీజేపీ ఎన్డీఏ కూటమి అధికారం లో ఉన్న రాష్ట్రాలలో భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహి స్తున్నామని తెలి పారు. అధికారంలో లేని రాష్ట్రాలలో పార్టీ పరంగా నిర్వహిస్తు న్నామని, దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం బిర్సా ముండా చేసిన పోరాటస్ఫూర్తితో ఈ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించిన గిరిజన గౌరవ దినోత్స వాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి సావిత్రిఠాకూర్, ఎన్.రామచంద్రరావు తదితరులు

# రామోజీ అవార్డు గ్రహీతలు వీరే..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 16:** రామోజీరావు అవార్డు గ్రహీతలకు రూ.5లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం,జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అమలా రూయా: గ్రామీణాభివృద్ధి విభాగంలో అసాధారణ కృషి చేసినందుకు అవార్డు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చారు.శ్రీకాంత్ బొల్లా: యూత్ ఐకాన్ కేటగిరీలో గుర్తింపు పొందారు. యువతకు ప్రేరణగా నిలిచి, విద్య, ఉపాధి రంగాల్లో కొత్త మార్గాలను సృష్టించారు.మాధవీలత: సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభ చూపి అవార్డు సాధించారు. ఆవిష్కరణల ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ముందుకు నడిపించారు. ఆకాశ్ టాండన్: మానవసేవా రంగంలో అమానత్వంగా కృషి చేసినందుకు గౌరవం లభించింది. అసహాయులకు, అనాథలకు అందించిన సేవలు అపూర్వమైనవి. ప్రసన్న శ్రీ: కళసంస్కృతి క్షేత్రంలో సృజనాత్మకతకు అవార్డు. భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. జైదీప్ హార్దికర్: జర్నలిజం రంగంలో సత్యసంధత, నిర్మలతతో పనిచేసి నందుకు గుర్తింపు. సమాజ సమస్యలను వెలుగు లోకి తీసుకువచ్చారు. పల్లవి ఘోష్: మహిళా సాధికారత కేటగిరీలో అవార్డు. మహిళల హక్కులు, సాధికారత కోసం చేసిన కృషి ప్రశంసనీయమైనది.

# తెరుచుకున్న శబరిమలై అయ్యప్ప దేవాలయం

### నేటినుంచి భక్తులకు దర్శనాలు

**పతనంతిట్ట, నవంబరు 16:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం మండల మకర విళక్కు పూజల కోసం ఆదివారం సాయంత్రం 5 గంటలకు తెరుచుకుంది. ప్రధాన పూజారి కందరార్ మహేశ్ మోహనార్ సమక్షంలో మేల్‌సంతి అరుణ్ కుమార్ నంబూద్రీ ఆలయ ద్వారాలను శాస్త్రోక్తంగా తెరిచారు. సంప్రదాయం ప్రకారం ప్రధాన పూజారి 18 మెట్లు మీదుగా దిగి, సన్నిధానం నుంచి తీసుకొచ్చిన జ్వాలతో అధీని (పవిత్ర గుండం) వెలిగించారు. అనంతరం పడిమెట్ల వద్ద వేచి ఉన్న పూజారుల చేతులను పట్టుకుని గర్భగుడి వద్దకు తీసుకెళ్లారు. ఆలయాన్ని తెరిచినప్పటికీ వృశ్చిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు అధికారిక ఆచారాలు, కొత్తగా నియమితులైన పూజారులు తలుపులు తెరవడంతో యాత్రా సీజన్ మొదలవుతుంది. రేపు ఉదయం నుంచే భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. ఉదయం 6.30 గంటలకు తంత్రి శబరిమల అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి వద్ద మెల్‌సంతి అభిషేకం చేసి ప్రతిష్టిస్తారు. ఆ తర్వాత మాలికప్పురం ఆలయంలో ప్రతిష్ఠాపన జరుగుతుంది. రోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు ఉంటాయని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు తెలిపింది. డిసెంబరు 2 వరకు వర్చువల్ క్యూ టిక్కెట్ బుకింగ్ తెరిచే ఉంటుంది. రోజుకు 70 వేల వర్చువల్ క్యూ టోకెన్లు, స్పాట్ బుకింగ్ ద్వారా 20,000 టోకెన్లు జారీచేస్తారు. రోజుకు 90 వేల మందిని దర్శనానికి అనుమతిస్తారు పంపాలో ఒకేసారి పదివేల మందికి వసతి కల్పించే పది వాకింగ్ పెవిలియన్లు, ఒక జర్మన్ పెవిలియన్ ఉన్నాయి. పంపా, నిలక్కల్, ఎరుమేలి, వండిపెరియార్ సత్రం, చెంగన్నూర్లలో స్పాట్ బుకింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు టీడీబీ తెలిపింది. గణపతి హోమం, అష్టాభిషేకం, నెయ్యాభిషేకం, ఉదయం పూజ, సాయంకాల పూజ, నిత్య పూజ, పుష్పాభిషేకం కోసం ఆన్లైన్ బుకింగ్‌లు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంటి నుంచే స్వామివారి ప్రసాదాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఆన్లైన్ టికెట్లు రద్దు చేసుకుంటే, వాటిని లైవ్ బుకింగ్‌గా మారుస్తారు. ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ నవంబరు 1న ప్రారభం కాగా ఇప్పటి వరకూ 22 లక్షల మందికిపైగా భక్తులు బుక్ చేసుకున్నారు. నవంబరు 17 నుంచి 41 రోజుల పాటు కొనసాగే మండల పూజ డిసెంబర్ 27న ముగుస్తుంది. ఆ రోజు రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసి.. మకరు విళక్కు పూజల కోసం డిసెంబర్ 30న తెరుస్తారు.

## బిఆర్‌ఎస్‌తో విభేదాల్లేవు, నవీన్‌యాదవ్‌కు

# వ్యక్తిగతంగానే మద్దతు ఇచ్చా

### అసదుద్దీన్ ఒవైసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 16:** బిఆర్‌ఎస్‌తో తమకెలాంటి విభేదాల్లేవు, జుబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పార్టీతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా మాత్రమే నవీన్ యాదవ్‌కు మద్దతిచ్చామని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. జుబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ తాము కాంగ్రెస్‌కు మద్దతిచ్చినట్లు భావించడం సరికాద న్నారు. కెసిఆర్ అయినా, తానైనా తమ పార్టీలకు ఏది మంచిదనిపిస్తే అది చేసుకుంటూ వెళ్తామని తెలిపారు.

నవీన్ యాదవ్ జుబ్లీహిల్స్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాలు కైవసం చేసుకున్న మజ్లిస్ పార్టీలో ఆనందోత్స వాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 23 స్థానాల్లో పోటీ చేసింది. ఐదు స్థానాల్లో విజయం సాధించడం ద్వారా తమ సిట్టింగ్ స్థానాలను నిలుపుకుంది. ఈ నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ అక్కడి ప్రజలను కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు ఈ నెల 21, 22 తేదీల్లో బీహార్‌లోని సీమాంచల్ వెళుతున్నారు. ఈ విషయాన్ని అసదుద్దీన్ ఎక్స్ వేదికగా తెలిపారు.

# జాతీయ విద్యావిధానం రద్దు కోసం జనవరి 29న ఢిల్లీలో మహాధర్నా

### టెట్ నుండి ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

### ఎస్‌టిఎఫ్‌ఐ కేంద్ర కమిటీ తీర్మానం

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** జాతీయవిద్యావిధానం రద్దు చేయడంతోపాటు పాతపెన్షన్ పునరుద్ధరణ రద్దు కోసం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) వచ్చే ఏడాది జవరి 29న ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించింది. టెట్ నుండి ఇన్ సర్వీసు ఉపాధ్యాయులని మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మహా ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు సిఎన్ భార్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఎస్టీఎఫ్ఐ కార్యదర్శి వర్గం, కేంద్ర కార్యవర్గ సమావేశాలు ఈ నెల 15, 16 తేదీల్లో ఢిల్లీ ఫరీదాబాద్‌లోని సంఘ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌టిఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర పాలకులు కార్పొరేటీకరణ , వ్యాపారీకరణ విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ.. పేదలను చదువుకు దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దాంతోపాటు ఆశాస్త్రీయ అంశాలతో రూపొందించిన జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ బాధ్యత ప్రభుత్వమే చూడాలని, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను తక్షణ మానుకోవాలని డిమాండ్ చేశారు. 2004 నుండి అమలులో ఉన్న నూతన పెన్షన్‌విధానం కార్పొరేట్లకు లాభం తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయుల కంట్రిబ్యూషన్ ఉన్న యుపిఎస్, జిపిఎస్, సిపిఎస్ లాంటి స్కీమ్స్ ఎస్‌టిఎఫ్‌ఐకి అంగీకారం కాదని తెలిపారు. తక్షణం పాతపెన్షన్‌ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిటిఈ నోటిఫికేషన్ ముందు నియామకమైన ఉపాధ్యాయులు కూడా టెట్ క్వాలిఫై కావాలనే సుప్రీంకోర్టు తీర్పు అప్రజాస్వామికమని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. దీనిపై కోర్టులో ఎస్‌టిఎఫ్‌ఐ రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని, కేంద్ర ప్రభుత్వంతోపాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో సవరణ చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు ఈ నెల 25న ప్రధానమంత్రి కార్యాలయానికి అన్ని జిల్లా యూనిట్స్ నుండి మెమోరాండంలు, మెయిల్ చేయాలని, నెలాఖరులోగా అధికార, ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులందరినీ కలిసి టెట్ మినహాయింపు అంశాన్ని పార్లమెంటులో చర్చించాలని కోరతామన్నారు. డిసెంబర్ 8,9 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో, జనవరి 5న రాష్ట్ర కేంద్రాల్లో ధర్నాలు చేయాలని సమావేశాల్లో నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలోనే జాతీయ స్థాయిలో ఇతర ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి టెట్‌పై ఐక్య కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. డిసెంబర్ 10వ తేదీన మానవ హక్కులన్నీ మహిళా హక్కులే అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డేని నిర్వహించాలని, సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జనవరి3ను జాతీయ మహిళా దినోత్స వంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్టు నాయకులు తెలిపారు.

# కాళ్లు, చేతులు కట్టేసి రిటైర్డ్ ఆర్మీ ఇంట్లో చోరీ

### 25 తులాల బంగారం, నగదును ఎత్తికెళ్లిన నేపాల్ ముఠా

### గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), నవంబరు 16, ప్రభాతవార్త:** ఇంట్లో నిద్రిస్తున్న రిటైర్డ్ ఆర్మీ అధికారి చేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్‌వేసి నేపాల్ ముఠా ఓ ఇంట్లో చోరీకి పాల్పడి 25 తులాల బంగారు ఆభర ణాలు 95 వేల నగదును ఎత్తికెళ్లిన సంఘటన కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తిరుమగిరి ఎసిపి రమేశ్, ఇన్‌స్పెక్టర్ అనురాధలు తెలిపిన వివరాల ప్రకారం గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న కెప్టెన్ గిరి (75) ఇంట్లో శనివారం అర్ధరాత్రి నేపాల్ ముఠా చోరీకి పాల్పడ్డారు. రెండు 2 సంవత్సరాలుగా అతని ఇంట్లో పనిచేస్తున్న నేపాల్ దంపతులు ఓ పథకం ప్రకారం దొంగతనం చేసినట్లు తెలిపారు. ఇంట్లో సర్వెంట్లుగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన రాజేంద్ర సాహి, అతని భార్య పూజ మరో నలుగురితోపాటు కలిసి దొంగతనం చేసినట్లు తెలిపారు. సినీ ఫక్కీలో కాళ్లు, చేతులు కట్టేసి మూతికి ప్లాస్టర్ వేసి 25 తులాల బంగారు అభరణాలు, 95 వేల నగదును దొంగిలించినట్లు తెలిపారు. ఇంటి యజమాని వృద్ధుడు కెప్టెన్ గిరికి మత్తుమందు తాగించే ప్రయత్నం చేయగా వారిని అడ్డు కున్నాడు. అదేవిధంగా ఇంట్లో పనిచేసే మరో మహిళకు కూడా మత్తుమందు ఇచ్చి ఇంట్లో ఉన్న బంగారం, నగదును ఎత్తికెళ్లారు. అదేవిధంగా గిరి ఒంటిపై ఉన్న బంగారాన్ని కూడా ఎత్తుకెళ్లారు. వెంటనే పక్కింటి వారి సహాయంతో గిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 6 బృందాలతో దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.





చోరీకి పాల్పడిన నేపాల్ దంపతులు

# ఒడిదుడుకుల్లో ద్రవ్యోల్బణం

### రాష్ట్రంలో మైనస్ 1.16 శాతం నమోదు

### జాతీయ సగటు కంటే తక్కువ

**హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవ త్సంలో ద్రవ్యోల్బణం ఒడిదుడుకులను ఎదుర్కొం టోంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణ రేటు నాలుగోసారి కొనసాగడం వల్ల ఆర్థిక స్థిరత్వంపై ఆందోళన నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా డేటా ప్రకారం తెలంగాణలో ద్రవ్యోల్బణం రేటు మైనస్ 1.16 శాతంగా నమోదైందని, ఇది జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని తెలుస్తోంది. కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ అక్టోబర్ నెలకు సంబంధించి విడుదల చేసిన తాజా వినియోగదారుల ధరల సూచిక డేటా ప్రకారం, భారతదేశ జాతీయ రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 వద్ద ఉంది. అయితే వినియోగదారుల ఆహార ధరల సూచిక 5.02 గణనీయమైన ప్రతి ద్రవ్యోల్బణ సంఖ్యను నమోదు చేసింది. ఇది ఈ కాలానికి జాతీయ స్థాయిలో ధరల మొత్తం సడలింపును ప్రతిబింబిస్తుంది. ఎక్కువగా ఆహార వర్గాలలో తగ్గుదల ద్వారా ప్రభావితమైంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ ఒక ప్రత్యేకమైన ధోరణిని ప్రదర్శిం చింది.

తాజా డేటాలో రాష్ట్రం ద్రవ్యోల్బణ రేటు 1.16 (ప్రతి ద్రవ్యోల్బణం)ను నివేదించింది. ఇటీవలి నెలల్లో అనేకసార్లు ప్రతి ద్రవ్యోల్బణ జోన్ లోకి ప్రవేశించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రికార్డ యింది. జూన్‌లో 0.93 తో ప్రారంభమైన ప్రతి ద్రవ్యోల్బణ దశ, జూలైలో 0.44 తో కొన సాగింది, ఆగస్టులో 0.94 ద్రవ్యోల్బణంతో స్వల్ప కోలుకుంది. అయితే సెప్టెంబర్‌లో మళ్ళీ 0.15 ప్రతి ద్రవ్యోల్బణానికి పడిపోయింది. ఈ నెలలో ప్రధానంగా గ్రామీణ తెలంగాణలో 0.29 ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది, అయితే పట్టణ తెలంగాణలో అది 0.05 నమోదైంది, రెండూ జాతీయ సగటు కంటే చాలా తక్కువ (ఈ నెల భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 ). ఈ విధంగా రాష్ట్రంలో ప్రతి ద్రవ్యోల్బణం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో దాని ప్రభావం ఆర్థిక వత్తిడిపై చూపుతుందనే ఆందోళన ఆర్థిక శాఖ అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో తిరిగి ద్రవ్యోల్బణంలోకి జారుకోవడం అంటే నాలుగు నెలల్లో మూడోసారి రిటైల్ ధరలు తగ్గడం, చెక్‌అవుట్ కౌంటర్లలో వినియోగదారులకు ఉపశమనం కలిగించడమే కాకుండా మరెన్నో సంకేతాలను ఇస్తుందని నిపుణులు అంటున్నారు. ఈ ధోరణికి నేరుగా వినియోగం బలహీనత, గ్రామీణ డిమాండ్ మందగించడంతో పాటు, హైదరాబాద్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలలో మందగమనం కారణం కావచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
టెండర్ నోటీస్ (పత్రికా ప్రకటన - 10/25-26)
చీఫ్ ఇంజనీర్/మాస్టర్ ప్లాన్ జోన్ యొక్క ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఈ క్రింది వాటికి బిడ్స్ కోరబడుతున్నవి. 1) Sp.No.13/25-26 (SC రిజర్వ్‌డ్) 33KV ... DC OH లైన్ కొరకు UG కేబుల్‌కు 33KV OH లైన్. 2) Sp.No.14/25-26 (SC రిజర్వ్‌డ్) 33KV ... DC OH లైన్ కొరకు UG కేబుల్‌కు 33KV OH లైన్. 3) Sp.No.15/25-26 ... 33/11KV O/D SS యొక్క స్థాపన. 4) Sp.No.16/25-26 ... 33/11KV I/D SS యొక్క స్థాపన. 5) Sp.No.17/25-26 ... సర్వే సం.152/P వద్ద కొత్త 33/11KV O/D SS యొక్క స్థాపన. బిడ్ ప్రారంభ తేదీ: 15.11.2025 సా.16.00 గం. వరకు ... చివరి తేదీ: 03.12.2025 సా.16.00 గం.ల వరకు ... తేదీ: 04.12.2025 ఉ.12.00 గం.లకు
గమనిక: ఇందుకు సంబంధించిన ఏ తదుపరి సమాచారం అయినా వెబ్‌సైట్ https://tgsouthernpower.org/generaltenders పై పొందవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్, మాస్టర్ ప్లాన్ జోన్, TGSPDCL మింట్ కాంపౌండ్, గ్రేటర్ హైదరాబాద్
DIPR.No.10744-PP/CL/Advt/1/2025-26, తేది: 15.11.2025

ఐడిబిఐ బ్యాంక్
CIN No. L65190MH2004GOI148838
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: ఐడిబిఐ టవర్, డబ్ల్యుటిసి కాంప్లెక్స్, కఫ్ పరేడ్, ముంబయి-400005.
టెండరు ప్రకటన
NIT No.02/ Admin& IMD/Housekeeping (Office Premises) Services/ 2025-26
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల IDBI సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ICBF)లో హౌస్ కీపింగ్ (ఆఫీస్ ప్రాంగణం) సేవలకు టెండర్.
IDBI బ్యాంక్ లిమిటెడ్ యొక్క అత్యున్నత శిక్షణా కేంద్రమైన IDBI సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ICBF), హైదరాబాద్‌లో హౌస్ కీపింగ్ (ఆఫీస్ ప్రాంగణం) సేవల కోసం సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ సమర్పించడానికి చివరి తేదీ: డిసెంబర్ 08, 2025 - 15:00 గం.ల వరకు (మ. 3:00 గం.లు)
వివరాల కొరకు బ్యాంక్ వెబ్‌సైట్: www.idbibank.in ను దర్శించండి.
గమనిక: పైన పేర్కొన్న టెండర్లకు సంబంధించి ఏవైనా తదుపరి అనుబంధాలు/ సవరణలు/ తేదీల పొడిగింపు/ స్పష్టీకరణలు/ బిడ్డర్ల ప్రశ్నలకు ప్రతిస్పందనలు మొదలైనవి బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి. ప్రెస్‌లో ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయబడదు.
తేది: 17-11-2025 సం/- జనరల్ మేనేజర్, అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఐసిబిఎఫ్, హైదరాబాద్

